క్లుప్తంగా

పీలేరులో ట్రాఫిక్ సిగ్నల్స్‌కు ప్రతిపాదనలు



సీఐ మోహన్‌రెడ్డి

పీలేరు రూరల్ : ట్రాఫిక్ నియంత్రణకు పీలేరు పట్టణం క్రాస్ రోడ్డులో ట్రాఫిక్ సిగ్నల్స్‌కు ప్రతిపాదనలు పంపినట్లు సీఐ మోహన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పట్టణ జనాభా, వాహనాలు సంఖ్య అధికం కావడంతో నాలుగు రోడ్ల కూడలిలో, అలాగే రైల్వే గేట్లు వద్ద ఆర్‌ఓబీ పనులు జరుగుతుండడంతో తరచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని తెలిపారు. దీన్ని అధిగమించడానికి ఎస్‌ఐ, ఏఎస్‌ఐ, ఏడు కానిస్టేబుళ్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వాహనదారులు, ప్రజలు ట్రాఫిక్ నియంత్రణకు తమవంతు సహకారం అందించాలని కోరారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

పీలేరు రూరల్ : మండలంలోని అగ్రహారం పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి జరిగే కార్యక్రమంలో పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పాల్గొంటారన్నారు. కంభంమిట్టపల్లె, ఎల్లెలవారిపల్లె, ఆరెంవారిపల్లె, ఎనుమలవారిపల్లెలో పర్యటిస్తారని తెలిపారు. మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కంటి ఆపరేషన్లకు 35 మంది ఎంపిక



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పీలేరు రూరల్ : కంటి ఆపరేషన్లకు 35 మంది ఎంపికైనట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సురేంద్రనాథరెడ్డి, సుబ్రమణ్యం తెలిపారు. ఆదివారం స్థానిక ప్రసాద్ హాస్పిటల్‌లో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. వందమందికి కంటి పరీక్షలు నిర్వహించి 35 మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తిరుపతి అరవిండో కంటి వైద్యులు, లయన్స్‌క్లబ్ కోశాధికారి జయచంద్రనాయుడు, సభ్యులు మహేష్ గుప్తా, ఈశ్వర్‌రెడ్డి, సదాశివరెడ్డి పాల్గొన్నారు.

స్కూల్‌గేమ్స్ సెక్రటరీ సేవలు ప్రశంసనీయం

మదనపల్లె సిటీ: స్కూల్‌గేమ్స్ సెక్రటరీగా పని చేసిన రామ సేవలు ప్రశంసనీయమని ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో చిత్తూరు జిల్లా గుడుపల్లె మండలం యామిగానిపల్లెకు హెచ్‌ఎం పదోన్నతిపై వెళ్లిన రామను డివిజన్ పీడీలు ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల్లో క్రీడల అభివృద్ధికి ఎనలేని అందించారన్నారు. పదోన్నతి రావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ రాజగోపాల్,స్కూల్‌గేమ్స్ కార్యదర్శి వసంత, హెచ్‌ఎంలు సుబ్బారెడ్డి, రెడ్డన్నశెట్టి, పీడీలు పాల్గొన్నారు.

ఆలయానికి భక్తుల విరాళం



దాత వేదిక్‌రెడ్డి

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయానికి వైఎస్సార్ జిల్లా తిమ్మికంద్రిగ గ్రామానికి చెందిన భక్తులు వేదిక్‌రెడ్డి రూ.25వేలు విరాళంగా ఇచ్చారు. గత కొన్ని నెలలుగా గర్భాలయ నిర్మాణ పనులు ఇక్కడ జరుగుతున్నాయి. ఈనేపథ్యంలో ఆదివారం ఆలయానికి చేరుకొన్న దాతలు ఆలయ ఈఓ మంజులకు విరాళంగా అందజేశారు. ఈసందర్భంగా దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి శేష వస్త్రాన్ని అందజేశారు. విరాళం మొత్తాన్ని వాల్మీకిపురం సప్తగిరి గ్రామీణ బ్యాంకులో జమ చేస్తామని ఈవో తెలిపారు.

జిల్లా స్థాయి రోప్‌స్కిప్పింగ్ జట్టు ఎంపిక



రోప్‌స్కిప్పింగ్ చేస్తున్న క్రీడాకారులు

మదనపల్లె సిటీ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం జిల్లా స్థాయి రోప్‌స్కిప్పింగ్ జట్టు ఎంపిక జరిగింది. జిల్లా రోప్‌స్కిప్పింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంపికలు నిర్వహించారు. అండర్–10,12,14,16 జట్లకు వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు వచ్చారు. కార్యక్రమానికి ఎంఈఓలు ప్రభాకర్ రెడ్డి, రాజగోపాల్, అసోసియేషన్ కార్యదర్శి శరత్, పీడీ సుధాకర్‌లు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 29, 30న కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పీడీ సుధాకర్ తెలిపారు.

రోడ్డెక్కనున్న ఎలక్ట్రిక్ బస్సులు

- కాలుష్యం నివారించడం.. ఖర్చు తగ్గించడమే లక్ష్యం
- మదనపల్లె డిపోకు 12 బస్సులు
- నేటి నుంచి తిరుపతికి ఎలక్ట్రిక్ బస్సు సర్వీసులు



ఆర్టీసీ డిపోకు చేరుకున్న ఎలక్ట్రిక్ బస్సులు

మదనపల్లె సిటీ: ప్రజా రవాణా వ్యవస్థలో కాలుష్యాన్ని నివారించడంలో భాగంగా డీజిల్ భారం ఆర్టీసీకి గుదిబండగా మారిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయాల వైపు అడుగులు వేస్తోంది. ప్రజలపై భారం మోపలేక ...పెరుగుతున్న ఇంధన ధరలు భరించలేక ఎలక్ట్రిక్ వాహనాల వైపు మొగ్గు చూపుతోంది. ఇందులో భాగంగా ఏపీఆర్టీసీ జిల్లాలో మొట్ట మొదటిసారిగా సోమవారం నుంచి ఎలక్ట్రిక్ బస్సులను మదనపల్లె నుంచి తిరుపతికి నడపనున్నారు. డిపోకు 12 ఎలక్ట్రిక్ బస్సులు మంజూరయ్యాయి. బస్సుల చార్జింగ్ కోసం చార్జింగ్ పాయింట్లును డిపో ఆవరణంలో ఏర్పాటు చేశారు. తొలిసారిగా ఎలక్ట్రిక్ బస్సులను తయారు చేసిన ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్, ఈవీ ట్రాన్స్ ప్రైవేటు లిమిడెట్ నుంచి మొదట 100 బస్సులను గ్రాస్ కాస్ట్ కాంట్రాక్టు (జీసీసీ) అపెక్స్ మోడల్ ప్రాతిపదికన అందించేందుకు ఏపీఎస్ ఆర్టీసీ ఒప్పందం కుదుర్చుకుంది. ఫాస్టర్ అడాప్షన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ ఆఫ్ ఎలక్ట్రిక్ వెహికల్స్ (ఫేమ్–2) పథకం కింద ఆర్టీసీ ఈ కాంట్రాక్టును ఒలెక్ట్రా గ్రీన్‌విచ్‌కు అప్పగించింది. కాంట్రాక్టు ప్రకారం 12 నెలల పాటు ఈ బస్సుల నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలను ఒలెక్ట్రా కంపెనీ చూసుకోవాల్సి ఉంటుంది. జిల్లాలో మొట్టమొదటిసారిగా మదనపల్లె నుంచి తిరుపతికి 12 బస్సులు నడపనున్నారు. విడతలవారీగా మరిన్ని బస్సులను నడపనున్నారు.

ఒక్కసారి చార్జింగ్‌తో...

ఒక్కో ఎలక్ట్రిక్ బస్సు పొడువు తొమ్మిది మీటర్లు ఉంటుంది. సీట్ల సామర్థ్యం 35. లిథియం అయాన్ బ్యాటరీ ఆధారంగా ఇవి నడుస్తాయి. ఒక్కసారి చార్జ్ చేస్తే 180 కిలోమీటర్ల వరకు రాకపోకలు సాగించగలుగుతాయి. బ్యాటరీ చార్జ్ అయ్యేందుదకు మూడు నుంచి నాలుగు గంటల సమయాన్ని తీసుకుంటుంది. అడ్వాన్స్ బ్రేక్ సిస్టమ్ కలిగి ఉంటుంది. పూర్తి ఎయిర్ కండీషన్డ్ బస్సులు.

ఎంతో ప్రయోజనం



ఎలక్ట్రిక్ బస్సులు ఎంతో ప్రయోజనం. మదనపల్లె డిపోకు 12 బస్సులు మంజరయ్యాయి. సోమవారం నుంచి మదనపల్లె–తిరుపతి రూటులో బస్సులు నడపనున్నాం. బస్సులను ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వరరావు ప్రారంభించనున్నారు. రానున్న రోజుల్లో మరిన్ని బస్సులు రానున్నాయి. **–ఆర్‌సీ నిరంజన్, 2–డిపో మేనేజర్, మదనపల్లె**

నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి

మదనపల్లె డీఎస్పీ కేశప్ప



సబ్ డివిజన్ స్థాయి సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ కేశప్ప

మదనపల్లె : మదనపల్లె పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో నేరాల నియంత్రణపై పోలీసు అధికారులు దృష్టి సారించాలని, పాతనేరస్తులపై నిఘా ఉంచి, చట్టపరమైన కఠినచర్యలు తీసుకోవాలని డీఎస్పీ కేశప్ప అన్నారు. ఆదివారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో అన్నమయ్యజిల్లా ఎస్పీ ఆర్.గంగాధర రావు ఆదేశాల మేరకు సబ్ డివిజన్‌స్థాయి అధికారుల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ కేశప్ప మాట్లాడుతూ..2019 నుంచి 13 ఎన్‌డీపీఎస్ కేసుల్లో 44 మంది ముద్దాయిలను గుర్తించి అరెస్ట్ చేశామని, ఎస్పీ ఆదేశాల మేరకు వారిపై ప్రత్యేక నిఘా ఉంచి షీట్స్ ఓపెన్ చేశామన్నారు. మదనపల్లె పట్టణంలోని వన్,టూ, రూరల్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో గంజాయి అమ్మకందారులపై ప్రత్యేక నిఘా ఉంచి కేసులు నమోదుచేసి రౌడీ షీట్స్ ఓపెన్‌చేశామన్నారు. పోక్సో కేసుల్లో బాధితుల ఫిర్యాదుమేరకు సాంకేతికపరమైన ఆధారాలు సేకరించి నేరస్తులకు కఠినశిక్షలు పడేలా చేస్తున్నామన్నారు. హత్యకేసులకు సంబంధించి నేరస్తులను వెంటనే గుర్తించి అరెస్ట్ చేస్తున్నామని, అక్రమ నాటుసారా, కర్నాటక మద్యం విక్రేతలను గుర్తించి అరెస్ట్ చేశామన్నారు. మిస్సింగ్ కేసులకు సంబంధించి దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు కోర్టు అధికారులతో సంప్రదించి పెండింగ్ నాన్‌బెయిలబుల్ వారెంట్లను త్వరితగతిన అమలుపరిచాలని సీఐ, ఎస్‌ఐ, కోర్టు సిబ్బందికి సూచించారు. ఎర్రచందనం అక్రమరవాణా కేసుల్లో ముద్దాయిలపై సస్పెక్ట్ షీట్స్ ఓపెన్ చేయడంతో సీడీఆర్ సాంకేతిక పరిజ్ఞానంతో నేరస్తులను అరెస్ట్ చేస్తున్నామన్నారు. 174 సీఆర్‌పీసీ కేసులకు సంబంధించి దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. సీఐలు మహబూబ్‌బాషా, మురళీకృష్ణ, సత్యనారాయణ, శివాంజనేయులు, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, కోర్టుసిబ్బంది పాల్గొన్నారు.

శివ పార్వతుల కల్యాణోత్సవం

పెద్దతిప్పసముద్రం: స్థానిక పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో శివుని అరుద్ర నక్షత్రం సందర్భంగా శివ, పార్వతుల కల్యాణోత్సవం ఆదివారం కనుల పండుగగా నిర్వహించారు. శివాలయం సేవకులు ననగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మాస శివరాత్రి మహా మంగళహారతి కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు భోజన సౌకర్యం కల్పించారు.

రేపు కౌలు భూముల వేలం

నిమ్మనపల్లె : మండలంలోని తవళం శ్రీ నేలమల్లేశ్వరస్వామి దేవస్థానం ఆలయ భూములను కౌలుకు ఇచ్చేందుకు మంగళవారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఈఓ మంజుల తెలిపారు. వేలం పరిమితి ఏడాది కాలానికి ఉంటుందని, ఆసక్తి కలిగిన రైతులు పాల్గొనాలని కోరారు.

డిపోలను తనిఖీ చేసిన ఆర్టీసీ ఈడీ



మొక్కకు నీరు పోస్తున్న ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వరరావు

మదనపల్లె సిటీ: మదనపల్లె వన్,టు డిపోలను ఆదివారం ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కడప) గిడుగు వెంకటేశ్వరరావు తనిఖీలు చేశారు. డిపో ప్రాంగణను పరిశీలించారు. డిపో ఆవరణంలో మొక్కలు నాటారు. సిబ్బంది సమష్టిగా పని చేయాలన్నారు. పుణ్యక్షేత్రాల స్పెషల్ పేరుతో నిర్వహిస్తున్న ప్రత్యేక సర్వీసులు వల్ల ఆదాయం బాగా పెరుగుతోందన్నారు. ఇందుకు డీఎంలు ప్రత్యేక చొరవచూపడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రజారవాణాధికారి రాము, డీఎంలు మూరే వెంకటరమణారెడ్డి, ఆర్‌సీ నిరంజన్, సీఐలు రేవతి,గీత, ఎంఎఫ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం



సాయినారాయణసేవ ట్రస్టుకు చెక్కును ఎమ్మెల్యే చింతలకు అందజేస్తున్న దాత

వాల్మీకిపురం: సేవా కార్యక్రమాలకు దాతల సహకారం అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం పీలేరు మండలం ఎర్రగుంట్లపల్లి సర్పంచ్ చంద్రారెడ్డి, నీరజమ్మ దంపతులు స్థానిక సాయి నారాయణ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో జరుగుతున్న నిత్య అన్నదాన కార్యక్రమానికి రూ.50 వేల చెక్కును ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిరుపేదలను ఆదుకోవడంలో సంతృప్తి కలుగుతుందన్నారు. కార్యక్రమంలో పీలేరు సర్పంచ్ హబీబ్‌బాషా, సురేష్, లక్ష్మన్న, మురళి ప్రసాద్, ట్రస్టు సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి వినతి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్

పీలేరు : పీలేరు గ్రామ పంచాయతీలో ఇంటింటికీ ఇవ్వడానికి ఇప్పటికే 15 వేల మొక్కలు పంపిణీ చేయడం జరిగిందని, మరో 5 వేల మొక్కలు కావాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సర్పంచ్ హబీబ్‌బాషా విన్నవించారు. ఆదివారం స్థానిక ఎంఎం ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ఓ వివాహానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పీలేరులో జరిగిన అభివృద్ధి గురించి వివరించారు. మంత్రి సహకారంతో ప్రజలకు మొక్కలు పంపిణీ చేశామని తెలిపారు. మరో ఐదు వేల మొక్కలు కావాలని కోరడంతో మంత్రి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు కాదు.. నిజాలు నిరూపించాలి

- చింతపర్తికి సర్పంచ్ ఎవరు..?
- భార్యను అడ్డం పెట్టుకొని భర్త చలామణి
- కార్యదర్శి, సిబ్బందిపై సర్పంచ్ భర్త పెత్తనం
- వార్డు సభ్యులను పట్టించుకోని వైనం



మాట్లాడుతున్న వార్డు సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

వాల్మీకిపురం: మండలంలోని చింతపర్తి మేజర్ పంచాయతీ సర్పంచ్ మహిత, తన భర్త శేషాద్రి రెడ్డి పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని చింతపర్తి వార్డు సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు మండిపడ్డారు. ఆదివారం చింతపర్తి పంచాయతీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చింతపర్తి అభివృద్ధికి తాము సహకరించడం లేదని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. అసలు చింతపర్తికి సర్పంచ్ మహితనా లేక భర్త శేషాద్రి రెడ్డినా చెప్పాలన్నారు. ఇప్పటి వరకు ఆరుగురు పంచాయతీ కార్యదర్శులను మార్చడం జరిగిందన్నారు.. ఏ కారణం చేత కార్యదర్శులు మారారు?. సర్పంచ్ భర్త తప్పుడు బిల్లులపై సంతకాలు చేయమని కార్యదర్శులను బెదిరిస్తుండడంతో కార్యదర్శులు మారుతున్నారన్నారు. పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కాకుండా ఆమె భర్త కూర్చొని అధికారులను, సిబ్బందిని బెదిరిస్తునారన్నారు. రెండు సంవత్సరాలుగా అభివృద్ధి కాకపోతే 15వ ఫైనాన్స్ డబ్బులు, జనరల్ ఫండ్, పంచాయతీ వసూళ్లు చేస్తున్న డబ్బులు ఏమైయ్యాయని ప్రశ్నించారు. ఒక ట్రాక్టర్‌కి బిల్లు పెట్టి రూ.30 నుంచి రూ.40 వేలు డ్రా చేస్తున్నారన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చి డబ్బుకు డ్రా చేసి వాడుకున్న వాటికి ఆడిట్ చేయించే దమ్ముందా అని సవాల్ చేశారు. వార్డు సభ్యులు ఫోన్ చేసి లైట్లు వెలగడం లేదంటే నేనేమి కూలోడు కాదని చెప్పడం దారుణమన్నారు. పేదలకు జగనన్న ఇస్తున్న ఇళ్ల గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. జగనన్న కాలనీలో అనర్హులు ఉండే నిరూపించాలన్నారు. వీధి లైట్లు, నీటి సమస్యను సర్పంచ్ పట్టించుకోకపోవడంతో పంచాయతీ కార్యదర్శి సొంత డబ్బుతో వీధిలైట్లు, నీరు అందిస్తున్నారన్నారు. పంచాయతీ రూములకు సంబంధించి సగం రూములు టీడీపీ నాయకులే ఆక్రమించుకొని అనుభవిస్తున్నారన్నారు. చేపల చెరువుకు వైఎస్సార్‌సీపీ నాయకులు చందాలు వేసుకొని డబ్బులు కట్టామని, సర్పంచ్ చేతగానీ తనంతో వేలం వేయడం లేదన్నారు. గుంటి గంగమ్మ గుడి దేవదాయశాఖకు సంబంధించినది అని, గుడి లెక్కలు చూపించాలంటే దేవదాయశాఖను అడిగాలే కానీ వైఎస్సార్‌సీపీ నాయకులను, గుడి చైర్మన్‌ను కాదన్నారు. గుడి అభివృద్ధిని చూసి ఓర్వలేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. సర్పంచ్ పోరు భరించలేకనే ఆరు గురు పంచాయతీ కార్యదర్శులు మారారన్నారు. దీనిపై కలెక్టర్ స్పందించి సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ద్వారకనాథ రెడ్డి, వార్డు సభ్యులు చింతల వెంకట్రమణా రెడ్డి, ఉమాదేవి, కళ్యాణి, ముబారక్, ద్వారకనాథ రెడ్డి, అనసూయ, భరత్ కుమార్, శ్రీనివాసులు, రవీంద్రాచారి, రమణమ్మ, భూదేవి, వైస్ ఎంపీపీలు వెంకట్రమణ, కిరణ్ కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఓరుగంటి రమేష్, లక్ష్మినారాయణ రెడ్డి, చంగల్ రెడ్డి, ఫారుఖ్, మెంబరు శీనా, రవీంద్రారెడ్డి, బొప్పసముద్రం శ్రీనివాసులు, రెడ్డి సుబ్రమణ్యం, సుధాకర, చిన్నప్ప, షామీర్, వెంకట్రమణ తదితరులు పాల్గొన్నారు.

సేవకు సలాం



కరోనాలో విస్తృత సేవలు



సంజీవిని బస్సు ద్వారా కరోనా పరీక్షలు చేయిస్తున్న వలంటీర్ వెంకటరమణ (ఫైల్)

కరోనా విజృంభిస్తున్న సమయంలో ప్రజలకు సహకరించేవారే కరువయ్యారు. ఇళ్లలో నుంచి బయటకు వచ్చే పరిస్థితులు లేవు. ఆరోజుల్లో కరోనా పరీక్షలు నిర్వహించే నిమిత్తం తిరుపతి నుంచి గుర్రంకొండకు సంజీవిని బస్సు వచ్చింది. ఇళ్లలో కరోనా లక్షణాలతో బాధపడుతున్న వారికి వలంటీర్ వెంటకరమణ ధైర్యం చెప్పారు. సదరు బస్సు ద్వారా ప్రజలకు ఉచిత కరోనా పరీక్షలు చేసుకోవచ్చన్న విషయాన్ని తెలియజేసి ఉచితంగా కరోనా పరీక్షలను చేయించారు.

– గుర్రంకొండ

వలంటీర్లకు రుణపడి ఉంటాం



కరోనా సమయంలో వలంటీర్లు చేసిన సేవకు రుణపడి ఉంటాము. మా వీధిలో ఒకరికి కరోనా సోకింది. అధికారులు మా వీధిని రెడ్‌జోన్‌గా ప్రకటించారు. ఇళ్లలో నుంచి బయటకు రాలేని పరిస్థితి . ఈ సమయంలో మా ప్రాంతానికి చెందిన వలంటీర్ మాకు అన్ని రకాల సేవలు అందించారు. కావాల్సిన మందులు, నిత్యావసర సరకులు ప్రతిరోజు మా ఇళ్ల వద్దకే వచ్చి అందించేవారు.

– జ్యోతి, గుర్రంకొండ

హైదరాబాద్ వెళ్లి సురక్ష సర్వే



హైదరాబాద్‌లో బయోమెట్రిక్ తీసుకుంటున్న వలంటీర్ జీలాన్‌బాషా (ఫైల్)

బయోమెట్రిక్ ద్వారా వేలిముద్ర తీసుకుంటున్న ఈ వ్యక్తి పేరు దండు జీలాన్ బాషా. పెద్దతిప్పసముద్రం మండలంలోని కందుకూరు సచివాలయం పరిధిలో వలంటీర్‌గా పని చేస్తున్నాడు. ఇదే గ్రామానికి చెందిన బండ్లపల్లి ఖామూషావలి, భానూ దంపతులు పొట్టకూటి కోసం హైదరాబాద్‌లో ఉన్నా నెలకోసారి వచ్చి వెళ్ళేవారు. జగనన్న సురక్ష ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరి సమస్యను పరిష్కరించాలని సీఎం ఆదేశించారు. ఈ తరుణంలో వలస వెళ్లిన పేద కుటుంబం కోసం వలంటీర్ హైదరాబాద్ వెళ్లి లబ్ధిదారుల వద్ద వివరాలు నమోదు చేసుకుని బయోమెట్రిక్ తీసుకుని వచ్చాడు. ఇంటి స్థలంతో పాటు పక్కా గృహం కావాలని చెబితే సర్వేలో వివరాలను నమోదు చేసుకుని మానవత్వాన్ని చాటుకున్నాడు. జగనన్న సురక్ష ద్వారా ప్రతి లబ్ధిదారునికి న్యాయం జరగాలనే ఉద్దేశంతో బాధ్యతగా అక్కడికి వెళ్ళి సర్వే పూర్తి చేసానని వలంటీర్ జీలాన్‌బాషా పేర్కొన్నాడు.

– పెద్దతిప్పసముద్రం

ఎప్పటికప్పుడు సమాచారం చేరవేత



నా పేరు బండ్లపల్లి భానూ. పెద్దతిప్పసముద్రం మండలం కందుకూరు గ్రామం మాది. నిరుపేదలం. పొట్టకూటి కోసం కుటుంబ సభ్యులంతా హైదరాబాద్‌కు వచ్చాం. నెలా, రెండు నెలలకోసారి సొంతూరుకు వచ్చి వెళ్ళేవాళ్ళం. మేము అక్కడ ఉన్నా కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాల మంజూరు విషయంలో వలంటీర్ జీలాన్ బాషా మాకు ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తాడు. జగనన్న సురక్ష సర్వేకు మేము రాలేకపోతున్నామని చెబితే వలంటీర్ హైదరాబాద్‌కు వచ్చి బయోమెట్రిక్ తీసుకున్నాడు.

– భానూబీ

అంకిత భావంతో సేవలు..



కరోనా సమయంలో కృష్ణమ్మకు ఫించన్ అందిస్తున్న గ్రామ వలంటీరు భార్గవి (ఫైల్)

ఈ చిత్రంలో పింఛన్ పంపిణీ చేస్తున్న గ్రామ వలంటీరు పేరు జి. భార్గవి. పీలేరు మండలం వేపులబైలు పంచాయతీ వరంపాటివారిపల్లెలో వలంటీరుగా పని చేస్తున్న భార్గవి నిరంతరం ప్రజాసేవకే అంకితమైంది. కరోనా తీవ్ర ప్రభావం చూపుతున్న తరుణంలోనూ తన ప్రాణాలను పణంగా వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు సకాలంలో పింఛన్లు అందజేయడంతో పాటు వారి ఆరోగ్య విషయాలు ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకుని తగిన సూచలు ఇచ్చేది. ముఖ్యంగా ఎలాంటి ఆధారం లేని వృద్ధులకు నేనున్నా అండగా ఉంటూ ఆదుకుని ప్రశంసలు అందుకుంది.

– పీలేరు రూరల్

కన్నబిడ్డలా ఆదుకుంది



కరోనా కష్ట సమయంలో ఎవరూ పలకరించేవారు కాదు. అలాంటి సమయంలో మా గ్రామ వలంటీరు భార్గవి కన్నబిడ్డలా వచ్చి పలకరించేది. ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛను అందించేది. కరోనా సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించడం తోపాటు మందులు కూడా తెచ్చి ఇచ్చేది. ఆమె సేవలు మరువలేనివి.

– కృష్ణమ్మ, వరంపాటివారిపల్లె

ఆత్మరక్షణకు కరాటే అవసరం



మాట్లాడుతున్న డీఎస్పీ కేశప్ప

మదనపల్లె : ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరమని డీఎస్పీ కేశప్ప అన్నారు. ఆదివారం పట్టణంలోని టీటీడీ కల్యాణమండపంలో యూత్ కరాటే అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు డాక్టర్. ఏ.ఆర్.సురేష్ ఆధ్వర్యంలో ఏపీ ఇన్విటేషనల్ ఒకినావా గుజిరొయో ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి డీఎస్పీ కేశప్ప, డీఎస్‌డీఓ షేక్‌షఫీ, సీఐలు మహబూబ్‌బాషా, మురళీకృష్ణ, రామాంజనేయులు, ఎస్‌ఐ హరిహరప్రసాద్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ కేశప్ప మాట్లాడుతూ.....విద్యార్థులు, యువకులు కరాటే శిక్షణ తీసుకోవడంతో అనేక ప్రయోజనాలు ఉంటాయన్నారు. కరాటే నేర్చుకోవడం వల్ల ఆత్మరక్షణతో పాటు శారీరక ధృడత్వం కలుగుతుందన్నారు. విద్యార్థులు ఆటలు, కరాటే తదితర క్రీడల్లో ప్రావీణ్యం కలిగి ఉంటే చదువులోనూ చురుగ్గా రాణించే అవకాశం ఉంటుందన్నారు. పట్టణంలో అనుభవజ్ఞులైన కరాటేమాస్టర్లు అందరూ కరాటే అకాడమీని ఏర్పాటుచేస్తే బాగుంటుందని సూచన చేశారు. డాక్టర్.ఏ.ఆర్.సురేష్ మాట్లాడుతూ..40 ఏళ్లుగా పట్టణంలో కరాటేలో శిక్షణ ఇస్తున్నామన్నారు. మదనపల్లెలో తొలిసారిగా కరాటే ఛాంపియన్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్.లీలావతి, రేవతి ఫౌండేషన్ వ్యవస్థాపకులు రామ్మూర్తి, కరాటేమాస్టర్ మణిసాయి, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటకకు చెందిన కరాటే విద్యార్థులు, మాస్టర్లు పాల్గొన్నారు.

రెవెన్యూ రిటైర్డ్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులు

పీలేరు : రెవెన్యూ శాఖలో పదవీ విరమణ పొందిన ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ఆదివారం స్థానిక ఆర్‌ఆర్ రెసిడెన్సీలో నిర్వహించారు. రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ, చేపట్టాల్సి సేవ కార్యక్రమాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా పరస్పరం అభినందనలు తెలుపుకుంటూ పాత జ్ఞాపకాలు గుర్తుకు తెచ్చుకున్నారు. రెవెన్యూ శాఖలో సీనియర్లు అయిన రిటైర్డ్ డెప్యూటీ కలెక్టర్ వేదవ్యాస, రిటైర్డ్ తహసీల్దార్లు సత్యమూర్తి, పెద్దిరెడ్డి, కె.ఆర్. రమేష్‌లను ఘనంగా సత్కరించారు.